క్లుప్తంగా

పరామర్శ



పరామర్శిస్తున్న ఆనం విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు సిటీ : వైఎస్సార్‌సీపీ 25వ డివిజన్ మహిళా కార్యకర్త మాదవి కుమార్తె ప్రవళిని పార్టీ రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి శనివారం పరామర్శించారు. అనారోగ్యంతో జీజీహెచ్‌లో చికిత్స ఆమెను పరామర్శించి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు. మహ్మద్ జుబేర్, జాహిద్, మురళి యాదవ్ పాల్గొన్నారు.

అభినందన



నెల్లూరు(బృందావనం) : ప్రపంచ శాస్త్రీయ నృత్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీస్‌కాలనీలో ఉన్న డీజే డ్యాన్స్ అకాడమీలో నృత్య పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం అభినందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు, జయప్రకాష్, రఘురామిరెడ్డి, శీనయ్య, డ్యాన్స్ అకాడమీ నిర్వాహకులు ప్రవీణ్‌కల్యాణ్, వంశీ,మేఘన, తదితరులు పాల్గొన్నారు.

వాసవి మాతగా కన్యకాపరమేశ్వరి



నెల్లూరు(బృందావనం) : స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు శనివారం 'శ్రీవాసవి' అలంకారంలో భక్తులను కటాక్షించారు. శ్రీపీఠం బృందంచే కోలాట ప్రదర్శన నిర్వహించారు. ఉభయకర్తలుగా బయ్యా వాసు- శైలజ, బయ్యా రవి- రంగమల్లిక దంపతులు వ్యవహరించారు. అమ్మవారి నగరోత్సవం వేడుకగా సాగింది. భక్తులు విశేషంగా విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ కోట గురుబ్రహ్మం, కార్యనిర్వాహక అధ్యక్షుడు శేగు షణ్ముఖరావు, కోశాధికారి జనార్దన్, ఆంజనేయులు, పాబోలు సత్యం, కిశోర్, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలి

నెల్లూరు (టౌన్) : అనుబంధ కళాశాలల విశ్రాంత అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని రిటైర్డ్ ఎయిడెడ్ కళాశాలల అధ్యాపకుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక వీఆర్ కళాశాల సెమినార్ సమావేశ మందిరంలో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీఓఎంఎస్ 34ను తక్షణమే రద్దు చేయాలన్నారు. పెన్షనర్లకు గతేడాది జనవరి 1 నుంచి నాలుగు శాతం , జూలై 1 నుంచి మూడు శాతం, ఈ ఏడాది జనవరి 1 నుంచి రెండు శాతం డియర్‌నెస్ రిలీఫ్ ప్రకటించే విధంగా జీఓలు జారీ చేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర సెక్రటరీ మల్లికార్జునరెడ్డి, కోశాధికారి సుబ్రహ్మణ్యం, వైస్ ప్రెసిడెంట్ మస్తానమ్మ, హనుమంతరావు, రవీంద్ర, విశ్రాంత అధ్యాపకులు పాల్గొన్నారు.

అడల్ట్ సినిమాలకు అనుమతించొద్దు



నెల్లూరు సిటీ : ఎ సర్టిఫికెట్ సినిమాలకు 18 ఏళ్లలోపు వారిని అనుమతించవద్దని నెల్లూరు ఆర్డీఓ అనూష థియేటర్ల నిర్వాహకులకు తెలిపారు. ఈ మేరకు ఆమె నగరంలోని థియేటర్లను శనివారం తనిఖీ చేశారు. వసతులను పరిశీలించారు. నిబంధనలు పాటిస్తున్నారా.. లేదా అని ఆరాతీశారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని యజమానులను హెచ్చరించారు.

ఆర్థోపెడిక్ వైద్యశిబిరం నేడు

నెల్లూరు(బృందావనం) : కోటమిట్ట మన్సూర్ నగర్‌లో మసీద్ వద్ద ఉన్న హాజిరా హాస్పిటల్లో ఆదివారం ఉచిత ఆర్థోపెడిక్ వైద్యశిబిరం జరుగనుందని నిర్వాహకులు శనివారం తెలిపారు. జమాఅతె ఇస్లామిహింద్ ఆధ్వర్యంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్య శిబిరం ఉంటుందన్నారు.

విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు

- పలువురు కార్యదర్శులకు చార్జ్‌మెమోలు



కాలువల్లో నిల్వచేరిన మురుగును పరిశీలించి సూచనలు చేస్తున్న కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు) : పారిశుద్ధ్య విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పనిసరి అని కమిషనర్ నందన్ శానిటేషన్ అధికారులు, వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులను హెచ్చరించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా కమిషనర్ స్థానిక శెట్టిగుంట రోడ్డు, అరుంధతీయ పాళెం, థమ్స్ అప్ గోదామ్స్ తదితర ప్రాంతాల్లో శనివారం పర్యటించారు. డివిజన్ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ ఆశించిన స్థాయిలో లేదని కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంబంధిత శానిటేషన్ కార్యదర్శులకు చార్జ్ మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్థానికులు అందజేసిన వినతిపై విచారించి జనావాసాల మధ్య ఉన్న పశువుల కొట్టంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించారు. పశువుల శాలను జనావాసాల నుంచి వెంటనే తరలించాలని సంబంధిత యజమానులను ఆదేశించారు. ఈ మేరకు పశువుల యజమానులకు నోటీసులు జారీ చేసి వారి నుంచి అంగీకార పత్రాన్ని తీసుకున్నారు. బహిరంగ ప్రదేశాలలో వ్యర్థాలు వేసే వారిని గుర్తించి హెచ్చరించాలన్నారు. నగరంలోని అన్ని ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నామని, ప్రతి ఒక్కరూ తమ స్థలాల చుట్టూ ప్రహరీ నిర్మాణం, గేటు ఏర్పాటు, తగిన రక్షణ చర్యలను తీసుకుంటూ పరిశుభ్రంగా ఉంచేందుకు దోహదపడాలని సూచించారు. స్థానిక కార్పొరేటర్ మద్దినేని మస్తానమ్మ, ఏఈ రమణారెడ్డి పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి



చెత్త తరలింపు ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంహెచ్‌ఓ చైతన్య

నెల్లూరు(బారకాసు) : పారిశుద్ధ్య పనులకు సంబంధించి సమయపాలన తప్పనిసరి అని, లేని పక్షంలో చర్యలుంటాయని నగరపాలక ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య శానిటేషన్ సిబ్బందికి సూచించారు. నగరంలోని ధనలక్ష్మీపురం మెయిన్ రోడ్డు వద్ద శానిటేషన్ పనులను ఆయన శనివారం పర్యవేక్షించారు. 12వ వార్డు సచివాలయ సెక్రటరీ తగిన సమయంలో హాజరుకానందున అతనికి షోకాజ్ నోటీస్ జారీ చేశారు. 19వ వార్డు రామలింగాపురం అన్నా క్యాంటీన్ వద్ద పూడిక తీసిన కాలువలను పరీక్షించారు. అనంతరం 45వ వార్డు ఆత్మకూరు బస్టాండ్, 51వ వార్డు బోసు బొమ్మ వద్ద జరుగుతున్న శానిటేషన్ పనులను పర్యవేక్షించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఏసీ మార్కెట్ అన్నా క్యాంటీన్‌ను సందర్శించి ఆహారం నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు.

దాడులను అరికట్టాలి



మాట్లాడుతున్న దయాకర్

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : రాష్ట్రంలో వడ్డెర వర్గీయులపై జరుగుతున్న దాడులను రాష్ట్ర ప్రభుత్వం అరికట్టాలని వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్ డిమాండ్ చేశారు. సంఘ రాష్ట్రస్థాయి సమావేశం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరంలో ఈనెల 17న నిర్వహించనున్న సంఘ ప్రథమ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని కోరారు. వడ్డెరలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక రక్షణ కల్పించాలని, అలాగే వృత్తిరీత్యా మరణించిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని, చేతివృత్తుల్లో నైపుణ్యం పెంచేందుకు ప్రత్యేకంగా స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. నిరుద్యోగులకు భృతి ఇవ్వాలని, కంకర క్వారీలు, గ్రావెల్, ఇసుక, మైనింగ్ గనుల నిర్వహణ హక్కును వడ్డెరలకు కల్పిస్తామని ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వడ్డెర కార్పొరేషన్ను ఏర్పాటు చేసి, డైరెక్టర్లు, చైర్మన్లను నియమించాలన్నారు. సమావేశంలో తిరుపాలు, బాలవెంకటేశ్వర్లు, మల్లి, నాగార్జున, ఖాసీం, రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

రక్త పరీక్షలను పక్కాగా నిర్వహించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ తదితరులు

నెల్లూరు(అర్బన్) : రోగులకు సంబంధించిన రక్త పరీక్షలను పక్కాగా చేయడంతో పాటు సకాలంలో రిపోర్టులు అందించేలా చర్యలు వేగవంతం చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత సూచించారు. నగరంలోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో జిల్లాలోని లాబ్ టెక్నీషియన్లతో శనివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ 63 రకాల పరీక్షలను చేయాల్సి ఉందన్నారు. టెక్నీషియన్లు ఎఫ్ఆర్ఎస్ హాజరు తప్పనిసరిగా వేయాలన్నారు. టీబీ పరీక్షలు, రికార్డులు సక్రమంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలీ, జిల్లా మలేరియ నివారణాధికారి హుస్సేనమ్మ, సహాయ మలేరియా నివారణాధికారి నాగార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

సేవాభావంతో పనిచేసే వైద్యసంస్థలకు సహకారం

- మంత్రి సత్యకుమార్ యాదవ్



జయభారత్ ఆస్పత్రిలో ఎన్ఐసీయూను ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్

నెల్లూరు(అర్బన్) : లాభాపేక్ష లేకుండా సేవాభావంతో పనిచేసే ప్రైవేటు వైద్యసంస్థలకు ప్రభుత్వం తగిన సహకారం అందిస్తుందని రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. నగరంలోని సింహపురి సేవా సమితి ట్రస్ట్ ద్వారా నిర్వహిస్తున్న జయభారత్ ఆస్పత్రిలో ఎన్ఐసీయూ(పురిటి పిల్లల ఇన్‌టెన్సివ్ కేర్) యూనిట్‌ను మంత్రి చేతుల మీదుగా శనివారం ప్రారంభించి, మాట్లాడారు. ప్రజారోగ్య పరిరక్షణలో ప్రభుత్వానికి తోడుగా ప్రైవేటు వైద్యరంగం తనవంతు సాయమందించాలని కోరారు. ప్రజారోగ్యం కోసం సింహపురి వైద్యసేవా సమితి ట్రస్ట్ స్థాపించి 40 ఏళ్లకు పైగా జయభారత్ ఆస్పత్రి ద్వారా తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యసేవలందించడం అభినందనీయమన్నారు. దాతల సహకారంతో జయభారత్ ఆస్పత్రిని నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఆస్పత్రి మరింత అభివృద్ధి చెందాలని, అందుకు తమ సహకారం అందిస్తామన్నారు. నేటి కూటమి ప్రభుత్వం కిడ్నీ వ్యాధి గ్రస్తులకోసం పది నెలల కాలంలో 18 నూతన డయాలసిస్ కేంద్రాలను ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో సేవా సమితి ప్రధాన కార్యదర్శి హరికుమార్‌రెడ్డి, వైస్ చైర్మన్ బాలసుబ్బారావు, కోశాధికారి సుధాకర్, ఆర్టీసీ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, జయభారత్ ఆస్పత్రి జీఎం గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు చిన్నారుల ప్రతిభ హర్షణీయం



ప్రతిభ చూపిన చిన్నారులను అభినందిస్తున్న సుమన్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : అంతర్జాతీయ చెస్ రేటింగ్ టోర్నీలో అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించిన నెల్లూరుకు చెందిన చిన్నారుల ప్రతిభ హర్షణీయమని రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.సుమన్ తెలిపారు. అనకాపల్లి ఫ్యూచర్ వరల్డ్ స్కూల్లో ఏప్రిల్ 26 నుంచి 30వ తేదీ వరకు జరిగిన రతన్‌టాటా స్మారక ఫిడే ఓపెన్‌చెస్ రేటింగ్ టోర్నీలో ప్రతిభ చూపిన బి.సూర్యనివాస్, బి.మోక్షనివాస్, జి.షాన్విక్‌రాజ్, ఎం.దీక్షితలను చిల్డ్రన్స్‌పార్క్ రోడ్డులోని జిల్లా చెస్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం అభినందించారు. కార్యక్రమంలో ఆర్ఎల్ చెస్ అకాడమీ కోచ్, డైరెక్టర్స్ రామలక్ష్మణ్ పాల్గొన్నారు.

అక్రమార్కులపై కఠిన చర్యలకు డిమాండ్

నెల్లూరు (క్రైమ్) : ఇసుక అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. దీన్‌దయాల్ నగర్‌లో ఇసుక అక్రమ తరలింపు వ్యవహారంలో అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని రూరల్ డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావును శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి, నారాయణకు చెడ్డపేరు తెచ్చే ఎవరైనా ఊరుకునేది లేదని హెచ్చరించారు.

అనుమతుల మంజూరుకు వినతి

నెల్లూరురూరల్ : పెంచలకోన అభయారణ్యంలో ఇరిగేషన్ కెనాల్ పనులకు అనుమతులు మంజూరు చేయాలని అటవీశాఖ చీఫ్ కన్సర్వేటర్ కార్యాలయంలో బీజేపీ నేత మిడతల రమేష్ వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు మంగళగిరిలోని అరణ్యభవన్‌లో సెక్షన్ ఆఫీసర్‌కు శనివారం ఆధారాలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు.

పూడికతీత విధిగా చేపట్టండి

నెల్లూరు(బారకాసు) : నగరంలోని అన్ని డివిజన్లలో మేజర్, మైనర్ డ్రెయిన్ కాలువల్లో పూడికతీత పనులను క్రమం తప్పకుండా చేపట్టాలని నగరపాలక కమిషనర్ నందన్ ఆదేశించారు. ఇంజినీరింగ్, పబ్లిక్ హెల్త్, వార్డ్ సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలువల పూడికతీత పనులతో పాటు పూర్తిస్థాయిలో సిల్ట్ తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఆరోగ్య శాఖ అధికారి చైతన్య, మలేరియా విభాగం అధికారి జిజియాబాయి, ఈఈలు రహంతు జానీ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

నెల్లూరురూరల్ : ఏపీ బీసీ సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మద్దులూరి సురేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చేతుల మీదుగా ప్రధాని మోదీ చిత్రపటానికి నగరంలో పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వచ్చే జనగణనలో కుల గణన చేయాలని నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామని తెలిపారు.

నెల్లూరు నగరానికి కొత్త మాస్టర్‌ప్లాన్

నెల్లూరు(బారకాసు) : నెల్లూరు నగరానికి సంబంధించిన జీఐఎస్ ఆధారిత కొత్త మాస్టర్‌ప్లాన్‌ను ప్రభుత్వం ఆమోదించిందని కమిషనర్ నందన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీఓ నంబర్ 50 ప్రకారంగా కొత్త మాస్టర్ ప్లాన్ను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్(హెచ్-2) డిపార్ట్‌మెంట్ ఈఏడాది మార్చి 26వ తేదీన ఆమోదించిందన్నారు. కొత్త ప్లాన్‌ను ప్రజలకు తెలియజేసేందుకు ఎన్ఎంసీ కార్యాలయంలో ఫ్లెక్సీ ద్వారా ఏర్పాటు చేశామన్నారు.

మార్కెట్లోకి ఎఫ్‌జెడ్ఎస్-వీ4 బైక్



నెల్లూరు(అర్బన్) : అధునాతన సౌకర్యాలతో మార్కెట్లోకి సరికొత్త యమహా ఎఫ్‌జెడ్ఎస్-వీ-4 బైక్‌ను విడుదల చేశారు. దీనిని తొలిసారిగా నెల్లూరు నిప్పో ఫ్యాక్టరీ పక్కన ఉండే గోల్డ్ ఫీల్డ్స్ షోరూమ్‌లో శనివారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథిలుగా నగరంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ కె.శ్రీధర్‌రెడ్డి, ప్రభుత్వ బాలుర ఐటీఐ జూనియర్ అసిస్టెంట్ అప్రెంటిషిప్ అడ్వైజర్ చెంగల్ రాయుడు తమ చేతుల మీదుగా బైక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సేల్స్ మేనేజర్ రామకృష్ణ మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా హైబ్రిడ్ బైక్‌ను ఆవిష్కరించినట్లు వివరించారు. గోల్డ్‌ఫీల్డ్స్ హెచ్ఆర్ సారథి, అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ ప్రసాద్, ఆరిఫ్, కస్తమర్లు పాల్గొన్నారు.

పార్టీ నాయకులతో ఆనం విజయకుమార్‌రెడ్డి



ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా

నెల్లూరుసిటీ : రూరల్ నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తలకు అండగా ఉంటానని వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయ్ కుమార్‌రెడ్డి అన్నారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని చింతారెడ్డిపాళెంలోని ఆయన నివాసంలో 17, 18వ డివిజన్ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రూరల్‌లో పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని, ప్రభుత్వ వైఫల్యాలను, అమలు కాని హామీలను ప్రజలకు తెలియజేయాలని, కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్న వారికి రానున్న కాలంలో మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. అనంతరం 17వ డివిజన్ పార్టీ ఇన్‌చార్జిగా మల్లి హరిబాబు, 18వ డివిజన్ ఇన్‌చార్జిగా నాగోలు భానుప్రకాష్‌రెడ్డిలను నియమించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, అధికార ప్రతినిధి శ్రీనివాసరావు(ఆర్ఎస్సార్), రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రటరీ శ్యామ్‌సింగ్, రూరల్ నియోజకవర్గ ఎంప్లాయిస్, పెన్షనర్స్ విభాగపు అధ్యక్షుడు కనకట్ల మోహన్‌రావు ముదిరాజ్ పాల్గొన్నారు.

యాదవుల అభ్యున్నతికి కృషి



బీద మస్తాన్‌రావుకు సత్కారం

నెల్లూరు సిటీ : జిల్లాలో యాదవుల అభ్యున్నతికి కృషి చేస్తానని జిల్లా యాదవ ఎంప్లాయిస్ సొసైటీ నూతన కమిటీ అధ్యక్షుడు రవీంద్ర, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. నగరంలోని మాగుంట లేఅవుట్‌లో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావును సొసైటీ సభ్యులు శనివారం కలిశారు. ఈ సందర్భంగా గజమాలతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ యాదవ ఎంప్లాయిస్ సొసైటీ ద్వారా పేద యాదవ విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. సొసైటీ ఆర్థిక కార్యదర్శి యనమల జానకిరామ్, రాష్ట్ర అధ్యక్షుడు, వ్యవస్థాపకుడు వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు మురళి, ఉడతా వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా సుదర్శన్



నియామక పత్రం అందజేత

నెల్లూరురూరల్ : జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా మర్రిపాడు మండలం రాంపల్లి గ్రామానికి చెందిన శేషం సుదర్శన్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో జేసీ కలెక్టర్ కార్తీక్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని శనివారం అందుకున్నారు.

జాకీర్‌హుస్సేన్‌కు నివాళి



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : భారతదేశ మాజీ రాష్ట్రపతి డాక్టర్ జాకీర్‌హుస్సేన్ వర్ధంతిని శనివారం నగరంలో ఘనంగా నిర్వహించారు. నగరంలోని 53వ డివిజన్ వెంకటేశ్వరపురం సెంటర్‌లో ఉన్న జాకీర్‌హుస్సేన్ కాంస్య విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నగర కార్యదర్శి నరసాపురం ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. పార్టీ నాయకులు కరీముల్లా, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

పూలే సాయంత్రం బడి ప్రారంభం



నెల్లూరు (టౌన్) : చలనం స్వచ్ఛంద సంస్థ కన్వీనర్ ఆలోచనతో నగరంలోని పలు పాఠశాలల్లో సావిత్రిబాయి పూలే సాయంత్రం బడి పేరుతో వేసవి శిక్షణా శిబిరాలను శనివారం నుంచి ప్రారంభించినట్లు ఆర్టీఏ జిల్లా అధ్యక్షుడు ఖాజా రహంతుల్లా, బీటీఏ ప్రధాన కార్యదర్శి ప్రసాద్, పూలే టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నం శ్రీనివాసులు తెలిపారు. పప్పులవీధిలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల, గాంధీనగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, సౌత్‌రాజుపాళెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో నెలరోజుల పాటు చదవుతో పాటు ఆటలు, పాటలు, చిత్రలేఖనం తదితర వాటిపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.

తాగునీటి సమస్యల్లేకుండా చర్యలు



మాట్లాడుతున్న కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు) : వేసవి దృష్ట్యా నగరంలోని అన్ని డివిజన్లలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని కమిషనర్ వైఓ నందన్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఎన్ఎంసీలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సమీక్ష సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అన్ని డివిజన్లలో చేతి బోర్ల పనితీరును పరిశీలించి, అవసరమైన వాటికి రిపేర్లు చేయించాలని సూచించారు. చేతిబోర్లు అవసరం లేని ప్రాంతాల్లో వాటిని పూర్తిగా తొలగించాలని తెలిపారు. అన్ని ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులు వాటి కెపాసిటీకి తగినట్లుగా నిండేలా చర్యలు తీసుకుని, సరఫరా చేపట్టాలన్నారు. వైఎస్సార్ నగర్ పరిధిలో నీటి ఎద్దడి ఎక్కువగా ఉన్న కారణంగా నీటి ట్యాంకర్ల సరఫరా ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని ఆదేశించారు. ప్రధాన మార్గాల్లోని డివైడర్లపై ట్యాంకర్ల ద్వారా కాకుండా డ్రిప్ సిస్టమ్ నీటి సరఫరా విధానాన్ని అవలంభించాలన్నారు. పశుపక్షాదుల దాహార్తిని తీర్చుకునేందుకు వీలుగా చిన్నపాటి ఏర్పాట్లను చేయాలన్నారు. పార్కుల్లో పచ్చదనం, పర్యావరణానికి ఇబ్బంది లేకుండా నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటి కుళాయి పన్నులను 'వాడకాన్ని బట్టి చార్జీలు' విధించడాన్ని కౌన్సిల్ సమావేశంలో ఉంచి ఆమోదించేలా ప్రతిపాదన రూపొందించాలని సూచించారు. సమావేశంలో ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహన్‌రావు, అధికారులు శేషగిరిరావు, రహంతు జానీ, శ్రీనివాసులు, రఘురామ్ పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని సంతపేటలో ఉన్న సీపీఐ జిల్లా కార్యాలయం వద్ద ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మున్నాలు సమాఖ్య పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశంలో యువత హక్కులు, నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి 1959 మే 3న అఖిలభారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) ఆవిర్భవించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కల్తీ ఆహార పదార్థాలు, గంజాయి, మాదక ద్రవ్యాలు, బెట్టింగ్‌లను అరికట్టడంలో విఫలమైందని ఆరోపించారు. చంద్రబాబు వలంటీర్లకు, నిరుద్యోగులకు ఇచ్చిన మాట తప్పాడని, ఆయా హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ, ఏఐవైఎఫ్ నాయకులు షానవాజ్, గౌస్‌బాషా, సర్దార్, బాదుల్లా, మన్సూర్, మునీర్, రఫీ, ముజీర్, వెంకటేష్, బాబి తదితరులు పాల్గొన్నారు.